

జడ్పీ ఇన్‌చార్జి సీఈవోగా సాయాగౌడ్

ఖిల్లా, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జడ్పీ ఇన్‌చార్జి సీఈవోగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సాయాగౌడ్ బాధ్యతలను చేపట్టారు. జడ్పీ సీఈవో బి.ఉషా దీర్ఘకాలిక సెలవుల్లో వెళ్లడంతో ప్రభుత్వం సాయాగౌడ్‌ను ఇన్‌చార్జి సీఈవోగా నియమించింది. దీంతో ఆయన సోమవారం బాధ్యతలను చేపట్టారు.



బాధ్యతలు చేపడుతున్న సాయాగౌడ్



వర్చువల్ ప్రారంభోత్సవాన్ని వీక్షిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

అట్టహాసంగా ఆరోగ్య ఉత్సవాలు

- నర్సింగ్ కళాశాల, మైత్రి ట్రాన్స్ క్లినిక్‌లను వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా పాలన ఏర్పాటై ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజా విజయో త్సవాల్లో భాగంగా ఆరోగ్య ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం మెడికల్ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పాల్గొన్నారు. నర్సింగ్ కళాశాల, మైత్రి ట్రాన్స్ క్లినిక్‌లను వర్చువల్ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని ఆరోగ్యవంతమైన తెలంగాణ సమాజంగా తీర్చి దిద్దాలనే లక్ష్యంతో వైద్య రంగానికి ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యం ఇస్తుం దన్నారు. అందులో భాగంగానే 7800 మంది నర్సింగ్ ఆఫీసర్లను ఇప్పటికే నియమించగా తాజాగా అసిస్టెంట్ సర్జన్‌ల ఖాళీలను భర్తీ చేశామన్నారు. త్వరలోనే వైద్య ఆరోగ్య శాఖలో మరో 6496 పోస్టులను భర్తీ చేయ నున్నామన్నారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పాటైన పది నెలల వ్యవధిలోనే 55వేల ఉద్యోగ నియామకాలు జరిపి సరికొత్త చరిత్రను లిఖించామన్నారు. కేవలం ఒక వైద్య శాఖలోనే 14వేల ఉద్యోగాలను, డిఎస్సీ ద్వారా 11వేల ఉద్యోగాలను నియమించామన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందిం చాలనే ఉద్దేశ్యంతో 16 నర్సింగ్ కళాశాలలను నెలకొల్పామని అన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని 5 నుంచి 10లక్షలకు పెంచామని గుర్తు చేశారు. వర్చు వల్ కార్యక్రమంలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహా, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, నరేందర్‌రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూతో పాటు జిల్లాలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమిక్ చైర్మన్ తా హెర్‌బిన్ హుందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజరెడ్డి, డీఎం అండ్‌హెచ్‌వో రాజశ్రీ, మెడికల్‌కళాశాల ప్రిన్సిపాల్ శివప్రసాద్, పాల్గొన్నారు.



- జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధమవుతున్న కాంగ్రెస్ పార్టీ నేతలు
- గ్రామస్థాయి నుంచి కార్యక్రమాల్లో పాల్గొంటున్న ప్రజాప్రతినిధులు
- స్థానిక సంస్థల్లో ఎక్కువ ప్రాతినిధ్యం ఉండే విధంగా ఇప్పటి నుంచే ప్రయత్నాలు
- వీరికి దీటుగా సన్నద్ధమవుతున్న జిల్లాకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ నేతలు

స్థానిక సంస్థలకు సన్నద్ధం

నిజామాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సన్నద్ధమవుతుండటంతో ప్రధాన పార్టీల నేతలు వీటి పై దృష్టిపెట్టారు. అధికార పార్టీతో పాటు ప్రతిపక్ష పార్టీల నేతలు గ్రామాలు, మండల స్థాయిలో పోటా పోటీగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికల కోసం సన్నద్ధం అవుతున్నారు. ఇంటింటి కుటుంబ సర్వే పూర్తికాగానే బీసీ కులగణన వివరాల ఆధారంగా రిజర్వేషన్‌పై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. జనవరిలో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉండ టంతో ప్రధాన పార్టీల నేతలు ముందస్తుగానే ఏర్పా ట్లను చేసుకుంటున్నారు. అధికార పార్టీకి దీటుగా ఎన్నికల్లో పోటీ పడేందుకు నేతలు సన్నద్ధమ వుతున్నారు. ప్రభుత్వ అభివృద్ధి పథకాలపై కాంగ్రెస్ నేతలు గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తుండగా వైఫల్యాలపై బీఆర్ఎస్, బీజేపీ నేతలు కార్యక్రమాలు చేపడుతున్నారు. ఎవరికి వారే క్యాడర్‌ను రంగంలోకి దింపుతూ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఎలాగైనా పోటీ చేసేందుకు పార్టీల నేతలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రిజర్వేషన్లు అను కూలిస్తే ప్రధాన పదవులపై దృష్టిపెట్టి కార్యక్రమాలు చేపడుతున్నారు.

పది నెలల క్రితం ముగిసిన సర్పంచ్‌ల పదవీ కాలం

స్థానిక సంస్థలైన గ్రామ పంచాయతీల సర్పంచుల పదవీకాలం ముగిసి పది నెలలు దాటింది. ప్రస్తుతం పంచాయతీలలో ప్రత్యేక అధికారుల ద్వారానే పాలన కొనసాగుతోంది. మండల పరిషత్, జిల్లా పరిషత్ సభ్యుల పదవీకాలం జూలైతో ముగిసింది. అప్పటి నుంచి ఐదు నెలలుగా ప్రత్యేక అధికారుల ఆధ్వర్యం లోనే పాలన కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లకు ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమవు తోంది. బీసీ కులగణన తర్వాత పూర్తిస్థాయిలో రిజర్వే షన్లను ప్రకటించి ఈ ఎన్నికలను చేపట్టనున్నారు. ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికలకు అధికారులు అన్ని సిద్ధం చేశారు. ఓటరు జాబితాను కూడా సిద్ధం చేస్తు న్నారు. ఈనెలలోనే పూర్తిస్థాయి ఓటరు జాబితాను ప్రకటించనున్నారు. ప్రభుత్వం నిర్ణయం తీసుకోగానే వచ్చే జనవరిలో ఈ ఎన్నికలను నిర్వహించనున్నారు.

ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న కాంగ్రెస్ నేతలు

ప్రభుత్వం వచ్చే నెలలో ఈ ఎన్నికలపై నిర్ణయం తీసుకొని నిర్వహించనుండటంతో అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు సన్నద్ధమవుతున్నారు. గత నెలరోజులుగా జిల్లాలో పలు కార్యక్రమాల్లో వారు పాల్గొంటున్నారు. అధికార పార్టీ నేతలు పలు అభివృద్ధి పథకాలను ప్రక టించడంతో పాటు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. గ్రామ, మండల స్థాయిలో పర్యటించడంతో పాటు పార్టీ బలోపేతం అయ్యే విధంగా చూస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం సన్నద్ధమవుతూనే ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తున్నారు. ఆరు గ్యారంటీల అమలు తీరుపై ప్రజలకు వివరిస్తూనే మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలను పూర్తిస్థాయిలో గ్రామాల్లో తిరిగే విధంగా చూడటంతో పాటు రిజర్వేషన్లకు అను గుణంగా బలమైన అభ్యర్థులను పోటీలో దించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. పదేళ్ల పాటు కాంగ్రెస్ అధికారంలో లేకపోవడం వల్ల స్థానిక సంస్థల్లో వారి ప్రాతినిధ్యం తక్కువగా ఉంది. సంవత్సరం క్రితం పార్టీ అధికారంలోకి రావడంతో నేతలు దృష్టి అంతా స్థానిక సంస్థలపై పడింది. సర్పంచ్ నుంచి మండల అధ్యక్షుని పదవుల వరకు పోటీ చేసేందుకు నేతలు సిద్ధమ వుతున్నారు. మండలాల పరిధిలో ఎవరికి వారే పోటా పోటీగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. రిజర్వేషన్లు అనుకూలిస్తే సర్పంచ్, ఎంపిటిసి, జెడ్పీటిసిలుగా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. కొన్ని మండలాల పరి ధిలోని నేతలు రిజర్వేషన్లకు అనుగుణంగా తమ సతీ మణులను బరిలోకి దించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో ఈ దఫా మెజార్టీ సీట్లను సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాకు చెందిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్యే భూప తిరెడ్డి, ఎమ్మెల్సీ పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో కార్యక్రమాలను చేస్తున్నారు. వీరితో పాటు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు మానాల మోహన్‌రెడ్డి, తాహెర్‌బిన్ హుందాన్, ఈరవత్రి అనిల్, అన్వేష్‌రెడ్డిలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. వీరితో పాటు నియో జకవర్గ ఇన్‌చార్జిలు ముత్యాల సునీల్‌కుమార్, వినయ్ రెడ్డితో పాటు నేతలు పాల్గొంటున్నారు. జిల్లా నామినే టెడ్ పదవుల్లో ఉన్న నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో కీలకమైన పదవులను కైవసం చేసుకు నే విధంగా సిద్ధమవుతున్నారు. ఆయా నియోజక వర్గాల పరిధిలో ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిల సూచనలకు అనుగుణంగా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. గ్రామాలు, మండలాల్లో ఉంటూ ఇప్పటి నుంచే ఎన్నికలకు సన్నద్ధమవుతున్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న బీఆర్ఎస్ నేతలు

పదేళ్లుగా జిల్లాలోని స్థానిక సంస్థల్లో కీలక ప్రజా ప్రతినిధులుగా ఉన్న బీఆర్ఎస్ నేతలు కూడా మళ్లీ పట్టు నిలుపుకునేందుకు ప్రయత్నాలను మొదలు పెట్టారు. రిజర్వేషన్లు అనుకూలిస్తే మళ్లీ పోటీ చేసేం దుకు మాజీ ప్రజాప్రతినిధులు సిద్ధమవుతుండగా అనుకూలించకుంటే తమ సతీమణులను దించేందుకు ఏర్పాట్లను చేసుకుంటున్నారు. జిల్లా పరిధిలో పదేళ్ల పాటు సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలుగా బీఆర్ఎస్ నేతలే 80 శాతంపైగా ఉన్నారు. వీరంతా ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేష్‌గుప్త, షకీల్ అమీర్, జీవన్‌రెడ్డిల ఆధ్వర్యంలో కార్యక్రమాలు పాల్గొంటున్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ముందుకు వెళ్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని ఆందోళనలు నిర్వహిస్తు న్నారు. కొంత మంది మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరగా మిగతావారు పోటీ చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కొత్త వారిని ప్రోత్సహించడంతో పాటు రిజర్వేషన్లకు అను గుణంగా నేతలను బరిలోకి దించేందుకు మాజీ మంత్రి ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మె ల్యేలు ప్రయత్నాలు చేస్తున్నారు. మొత్తంగా జిల్లాలోని స్థానిక సంస్థలలో తమ ప్రాతినిధ్యం ఉండే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

గ్రామ, మండల స్థాయిలో దృష్టి పెట్టిన బీజేపీ

గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించిన బీజేపీ నేతలు కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. కీలకమైన ఎంపీ స్థానంతో పాటు నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్‌లో బీజేపీ ఎమ్మెల్యేలు ఉండటంతో ఈ దఫా స్థానిక సంస్థల్లో కీలకమైన

మిగతా 8వ పేజీలో...

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

- రహదారిని ఆనుకొని ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- కానరాని రక్షణ కంచె, సూచిక బోర్డులు
- శిథిలావస్థలో ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెలు
- తరచూ జరుగుతున్న ప్రమాదాలు

7



'ప్రజావాణి'కి ప్రాధాన్యం ఇవ్వాలి

- సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు
- 80 వినతులను స్వీకరించిన అధికారులు

8



ఆ రహదారి.. యమ డేంజర్!

- 161 జాతీయ రహదారిపై వరుస ప్రమాదాలు
- ఆందోళనలో వాహనదారులు
- పశువుల సంచారంతో చోటు చేసుకుంటున్న ఘటనలు

7



ఆర్ఎంగా జ్యోత్స్న బాధ్యతల స్వీకరణ

సుభాష్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రీజియన్ ఆర్టీసీ నూతన మేనేజర్‌గా జ్యోత్స్న బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కేంద్రంలోని ఆర్ఎం కార్యాలయంలో సోమవారం బాధ్యతలను చేపట్టారు. ఆర్ఎంగా పనిచేసిన జానిరెడ్డి ఇటీవల బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో జ్యోత్స్న బాధ్యతలను స్వీకరించారు. నూతనంగా బాధ్యత లు చేపట్టిన ఆర్ఎంను ఆర్టీసీ అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభా కాంక్షలు తెలిపారు. అనంతరం ఆర్ఎం జ్యోత్స్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో డీవీఎంలు సరస్వతి, శంకర్, డిపో మేనేజర్లు సంపూర్ణ ఆనంద్, సాయన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్ఎం జ్యోత్స్నకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధికారులు



యాసంగి ప్రణాళిక సిద్ధం

- శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి యాసంగి సాగుకు ప్రణాళిక సిద్ధం చేసిన అధికారులు
- ఈ వారంలో సాగునీటి శాఖ మంత్రి ఆధ్వర్యంలో నీటి విడుదలపై సమావేశం
- బోనస్ ప్రకటనతో ప్రాజెక్టు పరిధిలో యాసంగిలో కూడా సన్నరకాల సాగుకే మొగ్గు చూపుతున్న రైతులు

నిజామాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి యా సంగి సాగుకు నీటిని అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ ప్రాజెక్టు పరిధిలోని మొత్తం ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు నిర్ణ యించారు. ఈ నెల చివరి వారం నుంచి ఆన్ ఆఫ్ పద్ధతిలో సాగునీటిని విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నారు. ప్రాజెక్టు ఆయకట్టు నిర్ణయించేందుకు ఈవారంలోనే సాగునీటి శాఖ మంత్రి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహి స్తు న్నారు. ఈ సమావేశంలో ఎస్సారెస్పీ, మిడ్ మా నేరు, లోయర్ మానేరు డ్యామ్‌ల నీటి నిల్వ లను బట్టి ఆయకట్టుపై నిర్ణయం తీసుకుం టారు. ప్రాజెక్టు పరిధిలోని కాకతీయ, లక్ష్మి, సరస్వతి కాలువలకు సాగునీటిని అందించడం తో పాటు ఎత్తిపోతల పథకాలకు నీటిని అందిం చే విధంగా ఏర్పాట్లను చేస్తున్నారు. ఈ మూడు ప్రాజెక్టుల్లో పూర్తిస్థాయిలో నీటి మట్టాలు ఉండ టంతో తాగునీటికి నీటిని నిలువ ఉంచి మిగతా మొత్తం నీటిని ఆయకట్టుకు అందించే విధంగా ఈ ప్రణాళికలను సిద్ధం చేశారు. డిసెంబర్ చివరి వారంలో మొదలు పెట్టి ఏప్రిల్ వరకు నీటిని అందించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు.

వరి సాగుపై రైతుల దృష్టి

యాసంగి సాగు మొదలవుతోంది. ఇప్పటికే ఆరుతడి పంటలను వేసిన రైతులు వరి పం టపై దృష్టిపెట్టారు. నారుమళ్లను సిద్ధం చేస్తు న్నారు. ప్రాజెక్టులు, చెరువులు, బావుల్లో నీళ్లు ఉండటం వల్ల ఈ దఫా కూడా ఎక్కువ మొ త్తంలో వరిసాగు చేసేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. శ్రీరాంసాగర్ నుంచి సాగు నీటిని విడుదల చేయనుండటంతో ముం దస్తుగా ఏర్పాట్లను చేస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం పూర్తిస్థాయిలో నీటిమట్టం ఉంది. ప్రాజెక్టులో 1091 అడుగులకు గాను అంతే మొత్తంలో నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి కెపాసిటీ 80.501 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. శ్రీరాంసాగర్ పరిధిలో కాకతీయ కాలువ ద్వారా స్టేజ్-1 కింద ఉత్తర తెలంగాణ జిల్లాలోని సుమారు 9.56 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఈ కాలువ పరిధిలో నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, హన్మకొండ, వరం గల్, మహబూబాబాద్ జిల్లాల ఆయకట్టు ఉంది. లక్ష్మి కాలువ నిజామాబాద్ జిల్లాకే

మిగతా 8వ పేజీలో...



విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చస్తున్న వైద్యులు



మానవతా సదన్ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

డిచ్‌పల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం లోని మానవతా సదన్‌లో 115మంది చిన్నారులకు సోమవారం నిజామాబాద్‌కు చెందిన వైద్యులు మోతీ లాల్, ప్రతిభ దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. ఇటీవల చలి తీవ్రత పెరిగిందని, విద్యార్థులకు ఉపయోగక రంగా ఉంటుందన ఉద్దేశ్యంతో దుప్పట్లు పంపిణీ చేశామని వారు తెలిపారు. మెడిసిన్ చదివే విద్యా ర్థులకు తమవంతు సహకారం అందజేస్తామని వారు హా మీ ఇచ్చారు. ఖాళీ సమయాల్లో విద్యార్థులు తయారు చేసి న గ్లాస్ పెయింటింగ్, అల్లికలు, బ్యాంగిల్స్ వంటి వస్తు వులను వైద్యులు చూసి అభినందించారు. ఈ కార్యక్రమం లో సదన్‌కేర్ టేకార్ రమేశ్, అకౌంటెంట్ సంధ్యారాణి, గంగామణి, సంధ్య, మంజుల, కోచ్ అజయ్ ఉన్నారు.

4న అండర్-19 బాలబాలికల వాలీబాల్ ఎంపికలు

సుభాష్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అండర్-19 బాలబాలికల ఉమ్మడి జిల్లాల ఎంపి కలను ఈనెల 4వ తేదీన నిర్వహించనున్నా మని ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారి రవి కుమార్ తెలిపారు. ఆర్మూర్ మండలం జడ్పీహెచ్ఎస్ మగ్గిడి పాఠశాలలో ఈ ఎంపికలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులు ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలు చదువుతూ 1-1-2007 తర్వాత పుట్టిన వారు మాత్రమే అర్హులని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రాలతో వ్యాయామ ఉపాధ్యాయుడు మధుసూదన్ 8886886780 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

వచ్చిన ఏడాదిలోనే 50వేల ప్రభుత్వ ఉద్యోగాలు

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



అబ్బాపూర్(బి)తండాలో మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

నవీపేట,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే 50వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడం జరిగిందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని సిరన్‌పల్లి, అబ్బాపూర్(బి)తండాలలో రూ.10లక్షల చొప్పున గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్బాపూర్(బి) తండాలో విలేకరులతో మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం బంగారు తెలంగాణ సాధిస్తామని చెప్పి అధికారంలోకి రాగానే అభివృద్ధి పట్ల నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్య, వైద్యం, రోడ్డు, ఇరిగేషన్ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. వరిపంటకు మద్దతు ధర చెల్లించడంతో పాటు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ చెల్లిస్తున్నామని అన్నారు. మోకన్‌పల్లి కేజీబీవీ పాఠశాలలో కోటి రూపాయల వ్యయంతో అదనపు గదుల నిర్మాణం చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యార్థులకు అందిస్తున్న మెస్ చార్జీలను 40శాతం పెంచి ఇస్తున్నామని దీని ద్వారా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందుతుందని అన్నారు. అనంతరం మోకన్‌పల్లి కేజీబీవీ పాఠశాలలో చేపట్టిన అదనపు గదుల నిర్మాణాలను పరిశీలించారు. పాఠశాలలో పాడైపోయిన సోలర్ గ్రీజర్‌కు వెంటనే మరమ్మత్తు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, బాలరాజు గౌడ్, కిరణ్ కుమార్, రాజేశ్వర్, పీర్‌సింగ్, ఎస్‌కే బాబు, ఈశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

నవీపేట,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోకన్‌పల్లి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఖాళీగా ఉన్న పోస్టులలో గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేక అధికారిణి కవిత తెలిపారు. పీజీసీఆర్టీ నర్సింగ్-02, మ్యాథ్స్ సీఆర్‌టీ-01, పీఈటీ-01 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. సంబంధిత కోర్సులలో శిక్షణ పొందిన మహిళ అభ్యర్థులు ఈ నెల 5లోగా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

లింగంపేటలో..

లింగంపేట,డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): లింగంపేట మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో గెస్ట్ ఫ్యాకల్టీగా పాఠశాల, కళాశాలల్లో బోధించేందుకు టీచింగ్ స్టాఫ్ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ఎస్‌వో వాసంతి తెలిపారు. పాఠశాల స్థాయిలో గణితం బోధించేందుకు సీఆర్‌టీ, కళాశాల స్థాయిలో తెలుగు బోధించేందుకు పీజీ సీఆర్‌టీకావాలని ఆమె తెలియజేశారు. బీఈడీతో పాటు సంబంధిత సబ్జెక్టులో పీజీ చేసిన వారు దరఖాస్తులు చేసుకోవాలని ఆమె సూచించారు. దరఖాస్తులను ఈనెల 4వ తేది వరకు లింగంపేట కస్తూర్బా పాఠశాలలో స్వీకరిస్తామని ఆమె తెలి యజేశారు.

కోటగిరిలో..

కోటగిరి,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో తాత్కాలిక పద్ధతిలో సోషల్ సబ్జెక్టు బోధించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేక అధికారిణి సవిత రాణి తెలిపారు. 6నుండి 10వ తరగతి వరకు సోషల్ సబ్జెక్టును ఇంగ్లీష్ మీడియంలో బోధించాల్సి ఉందన్నారు. సోషల్ సబ్జెక్టులో డిగ్రీ చదివి బీఈడీ చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎల్లారెడ్డిలో .

ఎల్లారెడ్డి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి కస్తూర్బా కళాశాలలో భౌతిక శాస్త్రం బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ పోస్టుకు ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 4వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవాలని కస్తూర్బా పాఠశాల,కళాశాల ప్రత్యేక అధికారి వీణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ ఫిజిక్స్, బీఈడీ చేసిన వారు దీనికి అర్హులని అన్నారు. ఇంటర్మీడియట్‌లో బోధించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎల్లారెడ్డి కస్తూర్బా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేక అధికారి వీణ తెలిపారు.

దోమకొండలో..

దోమకొండ, (బీబీపేట) డిసెంబరు (ఆంధ్రజ్యోతి):కేజీబీవీ బీబీపేటలో గెస్ట్ టీచర్ల నియామకం చేపట్టడం జరుగుతుందని ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల స్థాయిలో సీఆర్‌టీ, ఇంగ్లీష్, సీఆర్‌టీ సోషల్ అర్హత బీఈడీ, కళాశాల స్థాయిలో పీజీసీఆర్‌టీ, మ్యాథ్స్, ఫిజిక్స్అర్హత బీఈడీ, పీజీ దరఖాస్తులకు చివరి తేదీ 4వరకు, పదవి కాలం ఈ విద్య సంవత్సరం మాత్రమే అన్నారు. దరఖాస్తులు కేజీబీవీ బీబీపేట నందు స్వీకరించబడునని తెలిపారు.

నల్లబ్యాడ్జీలతో సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల నిరసన

వేల్పూర్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): సర్వశిక్ష అభియాన్ రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు సోమవారం వేల్పూర్‌లోని ఎంఆర్‌సీ వద్ద సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. గతంలో సీఎం ఇచ్చిన హామీ ప్రకారం పాఠశాల విద్యాశాఖలో సమగ్ర శిక్ష ఉపాధ్యాయులను వెంటనే విద్యశాఖలో విలీనం చేసి రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెగ్యులరైజ్ చేసేంత వరకు వెంటనే టీఎస్ఎస్ఏ ఉద్యోగులకు పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌సీ సిబ్బంది కృష్ణ, మూర్తి, శైలజ, మోలిక, జాన్సీరాణీ, శ్రీనివాస్, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో 2కే రన్

ఎల్లారెడ్డి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు అయిన ఏడాది పూర్తయిన సందర్భంగా విజయోత్సవాలలో భాగంగా సోమవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో అధికారులు, నాయకులు, విద్యార్థులు కలిసి అంబేద్కర్ చౌరస్తా నుంచి బస్టాండ్ గాంధీ చౌక్ మీదుగా 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం పూర్తయిన కాలం లో ఇచ్చిన హామీలను అమలు చేసిందని రైతులకు రుణమాఫీ, సన్న రకం వడ్లకు బోనస్, మహాలక్ష్మీ పథకాలు ప్రజలకు అందుతున్నాయని కాంగ్రెస్ ప్రభుత్వం హయాం లోని అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై మహేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రెంజల్‌కు ఎమ్మెల్యే రాక

రెంజల్,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): రెంజల్ మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంగళవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మొబిన్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. రెంజల్ మండల కేంద్రంలో గ్యాస్ గోదాం నుంచి శివాలయం వరకు రూ.6లక్షల వ్యయంతో మొరం రోడ్డు పనులకు శంకుస్థాపన కార్యక్రమాన్ని చేపడతారని, రెంజల్ నుంచి బ్రాహ్మణపల్లి క్రాస్ రోడ్డు వరకు రూ.20లక్షల వ్యయంతో చేపట్టే మొరం రోడ్డు పనులను ప్రారంభిస్తారని తెలిపారు. మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని చేపూర్ గ్రామశివారులో ఆదివారం రాత్రి జరిగిన లారీ, హార్వెస్టర్ ఢీకొన్న ప్రమాదంలో పలువురికి గాయాలు కాగా సోమవారం ఇందల్వాయి మండల కేంద్రానికి చెందిన గంగారాం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు ఆదివారం రాత్రి ట్రాక్టర్‌పై హార్వెస్టర్‌తో పెర్కిట్ నుంచి లక్కోరకు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టడంతో ట్రాక్టర్ రోడ్డు దాటి పొదల్లోకి పడిపోవడంతో పలువురికి గాయాలయ్యాయి. దీంతో సంఘటన స్థలాన్ని ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ పరిశీలించి గాయాలైన వారిని చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ హార్వెస్టర్ డ్రైవర్ గంగారాం మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

భీమ్‌గల్‌లో ప్రజాపాలన విజయోత్సవాలు

భీమ్‌గల్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది అయినందున సోమవారం భీమ్‌గల్ పట్టణంలో మున్సిపాలిటీలో ప్రజాపాలన విజయోత్సవలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నెప్రేమ లత సురేందర్, మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, కౌన్సిలర్‌లు సీహెచ్.గంగాధర్, సతీష్‌గౌడ్, కోఆప్షన్‌సభ్యుడు అజ్మతుల్లా, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సోయా రైతుల సమస్యలను పరిష్కరించాలి



సోయాపంటతో కలెక్టరేట్ ఎదుట నిరసన నిర్వహిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): సాలూర మండలం హున్స సహకార సంఘం పరిధిలోని సోయాపంట రైతుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం గ్రామస్తులు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సోయాపంటతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించామని సొసైటీ చైర్మన్ మందర్నా రవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోయాపంటను కోత కోసి ఆరబెట్టి రెండు నెలలు కావస్తున్న కేంద్ర ప్రభుత్వం నాఫెడ్ ద్వారా తెలంగాణ మార్క్‌ఫెడ్ ద్వారా సొసైటీల ద్వారా ప్రభుత్వ మద్దతు ధర 4892 కొనుగోలు చేస్తున్న సందర్భంలో మా ప్రాంతంలోని చాలా మంది రైతులు సోయాపంటను కోత కోయడం జరిగిందన్నారు. చేనుల్లో ఉన్న ఆకుల, అలుముల పసరు సోయాగింజలకు అంటుకుని కొంత రంగు మారిందని తెలిపారు. దీని మూలంగా సీడబ్ల్యూసీ సారంగపూర్ గోదాం అధికారులు సోయా లారీలను రిజక్ట్ చేసి తిప్పి పంపడం జరిగిందన్నారు. దీని మూలంగా ఈ సంవత్సరం ప్రైవేటు మార్కెట్‌లో క్వింటాలు సోయాకు రూ.4వేల నుంచి రూ.4200 చొప్పున దళారులు కొనుగోలు చేస్తూ రైతులను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీని మూలంగా రైతులు క్వింటాలుకు రూ.800రూపాయల చొప్పున నష్టానికి గురి కావాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం, సంబంధిత ఉన్నతాధికారులు రైతుల పట్ల సానుకూలంగా స్పందించి హున్స సహకార సంఘం పరిధిలోని సోయాపంటను ప్రభుత్వ మద్దతు ధరతో కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ వినోద్ బాబా, సహకార సంఘం డైరెక్టర్లు ఖాజాపూర్ అశోక్, చింతం మైసయ్య, శంకర్‌తో పాటు హున్స, మందర్నా, ఖాజాపూర్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ డబ్బులు చెల్లించాలని వృద్ధుల ధర్నా



రెంజల్‌లో ధర్నా నిర్వహిస్తున్న పింఛన్‌దారులు

రెంజల్,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతి నెల అందిస్తున్న పింఛన్ డబ్బులను సకాలంలో అందించాలని కోరుతూ సోమవారం రెంజల్ మండల పరిషత్ కార్యాలయం ముందు వృద్ధులు ధర్నా నిర్వహించారు. వివిధ గ్రామాలలో పింఛన్ చెల్లిస్తున్నప్పటికీ రెంజల్ గ్రామంలో డబ్బులు చెల్లించడం లేదని గత రెండు రోజుల నుండి ఇతర గ్రామాలలో పింఛన్ అందిస్తున్న ఇక్కడ మాత్రం పింఛన్‌లు అందించడం లేదని, ప్రభుత్వం సకాలంలో పింఛన్ డబ్బులు అందిస్తున్న అధికారులు పంపిణీ చేయడంలో జాప్యం జరుగుతుందని, జాప్యం జరగకుండా అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. ఎంపీడీవో వెంకటేష్, సూపరింటెంట్ శ్రీనివాస్ త్వరలో పింఛన్ పంపిణీ చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో వృద్ధులు శాంతించారు.

కోటగిరి మాజీ జడ్పీటీసీ కుటుంబానికి పరామర్శ



మాజీ జడ్పీటీసీ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మండవ వెంకటేశ్వర్ రావు

కోటగిరి,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): కోటగిరి మాజీ జడ్పీటీసీ శివరాజ్ దేశాయ్‌తో పాటు ఆయన తనయుడు రాజశేఖర్ దేశాయ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. సోమవారం ఆయన కుటుంబాన్ని మాజీమంత్రి మండవ వెంకటేశ్వర్ రావు పరామర్శించారు. శివరాజ్ దేశాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ జడ్పీటీసీ మృతి బాధకరని విచారం వ్యక్తం చేశారు. ఆయన వెంట కొత్తపల్లి విండో అధ్యక్షులు సునీల్ కుమార్, మాజీ ఎంపీపీ గంగాదర్ రావు దేశాయ్, బీర్కూర్ మాజీ జడ్పీటీసీ సతీష్ తదితరులున్నారు.

రైతులు కూరగాయల పంట వైపు మొగ్గు చూపాలి

● జిల్లా వ్యవసాయ అధికారి శాఖ వాజీద్ హుస్సేన్



నీలాలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి

రెంజల్,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): రైతులు కూరగాయల పంట వైపు మొగ్గు చూపాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజీద్ హుస్సేన్ అన్నారు. సోమారం మండలంలోని నీలా గ్రామంలో రైతులకు కూరగాయల పంట సాగుపై అవగాహన కల్పించారు. తీగ జాతి పంటలైన బీర, కాకర, దొండ మొదలైన పంటల సాగు వైపు దృష్టి సారించాలన్నారు. కూరగాయల కోసం పెండల్స్(సిమెంట్ పోల్స్)ను సబ్సిడీపై అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి కూరగాయల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన పేర్కొన్నారు. రైతులకు అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో వ్యవసాయ అధికారులకు సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రావు, ఏఈవోలు సాయిలు, అజయ్, రైతులు ఎంఎల్ రాజు, రమేష్, మరియదాస్, తదితరులు పాల్గొన్నారు.

కలిగోట్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలన



భోజనాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి ప్రవీన్

జక్రాన్‌పల్లి, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి):మండలంలోని కలిగోట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మధ్యాహ్న భోజనాన్ని మండల ప్రత్యేక అధికారి ప్రవీన్ పరిశీలించారు. అంతకు ముందు పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని వండి రుచికార భోజనాన్ని విద్యార్థులకు వడ్డించాలని వంట ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు. అంతకు ముందు వివేక్‌నగర్‌తాండాలో అంగన్‌వాడి కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడి కేంద్రంలో పిల్లలకు పౌష్టికాహారం, గుడ్లు, పాలు, ప్రభుత్వం అందించే ఆహారపదార్థాలను అందించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో సతీష్‌కుమార్, ఏంపీవో, ఉపాధ్యాయులు ఉన్నారు.

● సీఎం కప్‌పై సమావేశాన్ని నిర్వహించిన అధికారులు

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సీఎం కప్‌పై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి ప్రవీన్, ఎంపీడీవో సతీష్‌కుమార్, తహసీల్దార్ కిరణ్మాయి, ఎంఈవో శ్రీనివాస్, ఎస్సై తిరుపతి, ఎంపీవో యుసుఫ్‌ఖాన్, వివిధ పాఠశాలల వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చార్జ్‌షీట్ విడుదల చేసిన బీజేపీ నాయకులు



ఆర్మూర్‌లో చార్జ్‌షీట్ విడుదల చేసిన బీజేపీ నాయకులు

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం బీజేపీ నాయకులు కాంగ్రెస్ సంవత్సర పాలనపై చార్జ్‌షీట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా బీజేపీ అధికార ప్రతినిధులు జెస్సు అనిల్; కలిగోట్ గంగాధర్‌లు మాట్లాడుతూ నిధులు, నీళ్లు, నియమకాల పేరుపై తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 11ఏళ్లుపూర్తయ్యిందని, రాష్ట్రంలో సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైందని అన్నారు. పదేళ్లు పాలించిన బీఆర్‌ఎస్‌కు ప్రజలు బుద్దిచెప్పి కాంగ్రెస్‌కు అధికారాన్ని అప్పజెప్పి ఇచ్చిన హామీను నెరవేర్చకుండా వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి రూ.46వేల కోట్ల అప్పు చేశారని అన్నారు. గత పదేళ్ళలో కె టాక్స్ పేరిట ప్రస్తుతం ఆర్ఆర్ టాక్స్‌ల పేరిట ప్రజలను దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ హాస్టళ్ళలో సరైన సదుపాయాలు లేక కలుషిత ఆహారంతో విద్యార్థుల తల్లిండ్రుల శాపానికి గురవుతున్నారని తెలిపారు. రాష్ట ప్రభుత్వం సంవత్సరం పేరిట పండగ చేసుకోవడం కాదని, రాబోయే రోజుల్లో మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులకు తగిన గుణపాఠం చెబుతారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధానకార్యదర్శులు పొల్కం వేణు, పులి యుగంధర్, మీసాల రాజేశ్వర్, దోండి ప్రకాష్, బండ్లపల్లి నర్సారెడ్డి, తోట నారాయణ, ఉదయ్‌గౌడ్, దక్షిణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకులు అభివృద్ధిలో పోటీపడాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఆర్మూర్‌టౌన్,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకులు ఆర్మూర్ అభివృద్ధి చేయడంలో పోటీ పడాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ మున్న, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సాయిబాబాగౌడ్ అన్నారు. సోమవారం పట్టణంలోని పీవీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డిపై ఇష్టారీతిన మాట్లాడితే ఊరుకునేదిలేదని, అభివృద్ధికి కొరకు ఎల్లవేళల ప్రజలతో మమేకమై ప్రజల అవసరాలను తీరుస్తున్నారన్నారు. మీకు చిత్తశుద్ధింటే కేంద్ర ప్రభుత్వం నిధులు తీసుకురావాలని, అధికారులను బెదిరించడం సమంజసంకాదని, ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టే ప్రయత్నం చేయొద్దన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, మోత్కురి లింగాగౌడ్, పండిత్‌పవన్, రవీందర్‌రెడ్డి, కొంతం మురళీ, ఫయాజ్, కౌన్సిలర్‌లు తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

ఆర్మూర్‌టౌన్,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో ఏడుగురు పేకాటరాయుళ్ళను అరెస్టు చేసినట్టు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. తెలిసిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి పేకాట ఆడుతున్న స్థావరంపై దాడి చేయగా ఏడుగురు పేకాట రాయుళ్లతో పాటు రూ.47వేల700 నగదు, ఆరు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలోని చలపాక అటవీ ప్రాంతంలో జరిగిన బుటకపు ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలని ఐఎఫ్‌టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.సుధాకర్ సోమవారం ఒకప్రకటనలో తెలిపారు. తెలం గాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడానికి ముందు అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్య పునరుద్ధరణ, పౌర స్వేచ్ఛను కల్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఏడో గ్యారెంటీగా ప్రజలకు హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం సంవత్సరం కాలంలో దమరదొగు మొదలుకొని ములుగు జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లు చేయడం దారుణమని అన్నారు.

రైతులను విడగొడుతున్న ప్రభుత్వం

వేల్పూర్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): రుణమాఫీ పేరిట రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం విడగొట్టే ప్రయత్నాలు చేస్తుందని బీఆర్‌ఎస్ జిల్లా రైతు నాయకుడు మిట్టపల్లి మహిపాల్ విమర్శించారు. సోమవారం వేల్పూర్ మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రుణమాఫీలో భాగంగా రైతులకు లక్ష లోపు ఒక వర్గం, రెండు లక్షలు రైతులను మరోవర్గంగా వేరుచేసే ప్రయత్నం చేస్తున్నార న్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏకకాలంలో రూ.2లక్షల లోపు రైతులకు రుణమాఫీ చేయాలని డి మా ండ్ చేశారు. ఈనెల, ఆ నెల అనుకుంటూ రైతు భరోసా ఎగొ ట్టారన్నా రు. పెట్టుబడి లేక రైతులు నష్టపోయారన్నారు.

రేషన్ షాపు ప్రారంభం

నిజాంసాగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మండలాల్లోని జక్కాపూర్, వెలగనూరు, తుంకిపల్లి గ్రామాలలో సోమవారం రేషన్ షాపులను మండల పార్టీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ రవీందర్‌రెడ్డిలు ప్రారంభించారు.రేషన్ డీలర్లు డిసెంబరు నెల నుంచి సరుకులు ఇచ్చేందుకు రెవెన్యూ అధికార యంత్రాంగం ఉత్తర్వులు జారీ చేశారు. ఈకార్యక్రమంలో ఉమ్మడి మండలాల కార్యకర్తలు ఉన్నారు.

బీజేవైఎం నాయకుడికి పరామర్శ



బాధితున్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండల బీజేవైఎం ఉపాధ్యక్షుడు అరుణ్‌కుమార్‌ను సోమవారం ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి పరామర్శించారు. అరుణ్‌కుమార్ ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని యాశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ఆసుపత్రికి వెళ్ళి ఆయనను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి అరుణ్‌కుమార్ ఆరోగ్య పరిస్థితి అడిగితెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

30పడకల ఆసుపత్రికి భూమి విరాళం



దాతను సన్మానిస్తున్న దృశ్యం

మోస్రా,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): చందూరు మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం నిమిత్తం నిజామాబాద్-బాన్సువాడ ప్రధాన రహదారి పక్కన మారుతీనగర్‌లో గల అర ఎకరం భూమిని గ్రామానికి చెందిన ముప్పానేని చంద్రావతి, విద్యాసాగర్ 30పడకల ఆసుపత్రి నిర్మాణానికి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలను గ్రామస్థులు శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ప్రజల సౌకర్యార్థం 30పడకల ఆసుపత్రి నిర్మాణానికి భూమిని విరాళంగా ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు ప్యాయం అశోక్ యాదవ్, చందూర్ మండల మాజీ జడ్పీటీసీ అంబర్ సింగ్, మాజీ ఎంపీపీ లావణ్య రాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ దశగౌడ్, మాజీ సర్పంచ్ కర్లం సాయరెడ్డి, లక్ష్మాపూర్ మాజీ సర్పంచ్ సత్యనారాయణ, కారేగాం మాజీ సర్పంచ్ దేవిసింగ్, మేడిపల్లి మాజీ సర్పంచ్ రవి, సహకార సంఘం డైరెక్టర్లు కల్లూరి రాంరెడ్డి, మదరపు రుక్మిణి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సహాయం

జక్రాన్‌పల్లి,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మనోహరాబాద్ గ్రా మంలో జేఎంకెపీఎం పసుపు రైతుల ఉత్పత్తిదారుల పారిశ్రామిక సంఘం సోమ వారం మార్క్‌ఫెడ్ చైర్మన్, ఇస్‌కో డైరెక్టర్ మార గంగారెడ్డి సందర్శించి పరిశీలిం చారు. అనంతరం నిర్మిస్తున్న పారిశ్రమ యంత్రాలను వివరాలు అడిగితెలుసుకు న్నారు. ఆయన వెంట జెఎంకెపీఎం ప్రధానడైరెక్టర్ తిరుపతిరెడ్డి, పెర్కిట్ నర్సారెడ్డి, గంగన్న ఉన్నారు.

ఆర్మూర్‌రూరల్:ఆర్మూర్ పట్టణంలో ఇటీవల మృతి చెందిన తన బాల్యమిత్రుడు అశోక్ కుటుంబాన్ని సోమవారం రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి పరామర్శించారు. మృతుని కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సహయాన్ని అందజేశారు. అదే విధంగా డ్రైస్ వరల్డ్ మురళీ చౌళ అశోక్ కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహయాన్ని అందజేశారు.

తప్పిన ప్రమాదం దగ్ధమైన కారు



మేనూర్ జాతీయ రహదారిపై ఆకస్మాత్తుగా నిప్పంటుకున్న కారు

మద్నూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మద్నూర్ మండల కేంద్రానికి దగ్గరలో జాతీయ రహదారిపై ఆకస్మాతుగా కారుకు నిప్పంటుకోవడంతో ప్రమాదం తప్పి అందులో ఉన్న వారు బయటకు వచ్చారు. సోమవారం మండల కేంద్రం నుంచి సరిపూర్ గ్రామానికి వెళుతున్న కారు డిజిల్ ట్యాంకు నుంచి డిజిల్ కారిపోవడంతో అది గమనించి అందులో ప్రయాణీకులు కారును పక్కకు నిలిపివేసిన బయటకు వచ్చారు. ఆకస్మాత్తుగా ఒక్కసారిగా కారులో మంటలు వ్యాపించడంతో కారు మంటల్లో దగ్ధమైంది. జహీరాబాద్ పార్లమెంట్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ బంధువులకు సంబంధించిన కారుగా పోలీసులు గుర్తించారు.

శానిటేషన్ పనుల పరిశీలన

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): మున్సిపల్‌పరిధిలోని 23వ వార్డులో మున్సిపల్ కమిషనర్ రాజు సోమవారం సానిటేషన్ పనులను పరిశీలించారు. ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఆయన వెంట సానిటరీ ఇన్స్‌పెక్టార్ గజానంద్, పూర్ణమౌళి వార్డు ఆఫీసర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

జక్రాన్‌పల్లి,, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతతో విద్యార్థులకు వడ్డించాలని ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మండల విద్యావనరుల కేంద్రంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు శిక్షణ, సూచ నలు, సలహాలు అందజేశారు. ఈసమావేశంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం సు రేందర్‌రెడ్డి, కాంప్లెక్స్‌సిబ్బంది, ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.

సిద్దులగుట్టపై ఘనంగా పల్లకీసేవ

పెర్కిట్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దులగుట్టపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అయ్యప్ప, రామాలయం, దత్తాత్రేయ, ఎల్లమ్మతల్లి, ఏకశిల స్తంభం వద్ద గల హన్మాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, పీసీ.గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, చరణ్‌రెడ్డి, బోండ్ల ఆనంద్, బట్టు శంకర్, చందేశీ శ్రీనివాస్, ప్రశాంత్‌గౌడ్, హాజరీ సురేష్, కొంతం మురళీ, ఆలిశెట్టి నరేష్, రామాగౌడ్, సిద్దులగుట్ట సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

నర్సరీని పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

వేల్పూర్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం కొత్తపల్లి (ఎన్) గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా ఏర్పాటు చేసిన మొక్కల పెంపకం నర్సరీని సోమవారం వేల్పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గడ్డం నర్సారెడ్డి పరిశీలించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ ద్వారా నిర్వహిస్తున్న నర్సరీలో ఉపాధి కూలీలు బ్యాగ్ ఫిల్లింగ్ పనులను చేయడం జరుగుతుందని ఈజీఎస్ సిబ్బంది వైస్‌చైర్మన్ నర్సారెడ్డికి వివరించారు. ప్రతీ గ్రామపంచాయతీకి ఎనిమిది వేల మొక్కలు పెంచే విధంగా బ్యాగులు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ టీఏ సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్ విజయ, తదితరులు పాల్గొన్నారు.


మంగూర్ శివారు అటవీ ప్రాంతంలో కంచె లేని ప్రాంతం


రహదారి మధ్యలో మేత మేస్తున్న పశువులు (ఫైల్)


జుక్కల్ గుండా సాగుతున్న 161 జాతీయ రహదారి

ఫోకస్

ఆ రహదారి.. యమ డేంజర్!

● 161 జాతీయ రహదారిపై వరుస ప్రమాదాలు ● భద్రతపై వాహనదారుల సందేహం
● పశువుల సంచారంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయంటున్న స్థానికులు ● భద్రత పెంచాలని వాహనదారుల వేడుకోలు

పెద్దకొడప్‌గల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ నియోజక వర్గ ప్రజల చిరకాల వాంఛ అయిన 4 వరుసల రహదారి నిర్మాణం పూర్తి కావడంతో ఈ రహదారి గత 4 సంవత్సరాల నుంచి ప్రయాణానికి అందుబాటులోకి వచ్చింది. దీంతో ఈ రహదారిపై కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు చెందిన వాహనదారులతో పాటు, మహారాష్ట్ర కర్నాటక రాష్ట్రాలకు చెందిన వాహనదారులు నిత్యం వందల సంఖ్యలో వాహనాలతో రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ఈ రహదారి వాహనాల రాకపోకలతో బిజీగా మారింది. రహదారిపై ప్రయాణం మురిపెంగా ఉన్న అంతే సంఖ్యలో వాహన ప్రమాదాలు జరుగుతుండటంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. జుక్కల్ నియోజక వర్గంలోని నిజాంసాగర్ మండలం గుండి ప్రారంభం అయిన ఈ రహదారి పిట్లం, పెద్ద కొడప్‌గల్, జుక్కల్, బిచ్కుంద, మద్నూర్ మండలాల గుండా సుమారు 70 కిలోమీటర్ల మేర సాగుతుంది. రహదారి ప్రయాణానికి అనుకూలంగా ఉండటంతో వాహనాలు వేగంగా ప్రయాణిస్తున్న సమయంలో పశువులు సంచారంతోనే, అధిక వేగంతోనే వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయి. నియోజక వర్గంలో ఈ రహదారిపై వారం రోజుల వ్యవధిలో ఒకటో, రెండో ప్రమాదాలు జరిగి ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి.

రహదారిపైకి యథేచ్ఛగా పశువులు..

జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనాల వేగం గరిష్ఠంగా వంద కిలోమీటర్లకు పైగా ఉండటంతో వాహనాలు అధిక వేగంతో వెళ్తుంటాయి, వాహనాలు వేగంగా వెళ్లే సమయంలో ముందు అకస్మాత్తుగా ఏదయిన వాహనం గాని, పశువులు గాని వస్తే వాహనం కంట్రోలు కాదు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రహదారిపైకి పశువులు రాకుండా హైవే భద్రత సిబ్బంది వారు గ్రామాల సమీపంలో కంచెను ఏర్పాటు చేశారు. అయినా కూడా ఆయా గ్రామాలకు చెందిన పశువులు, గొర్రెలను వాటి యజమానులు మేత కోసం జాతీయ రహదారిపైకి తీసుకవస్తున్నారు. దీంతో పశువులు అకస్మాత్తుగా రహదారి మధ్యలోకి రావడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గత వారం రోజుల కిందట పిట్లం శివారులో రాత్రి సమయంలో రహదారిపైకి రెండు గేదెలు రావడంతో హైదరాబాద్ నుంచి నాందేడ్ వైపు వెళ్తున్న లారీ గేదెలను ఢీ కొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందడంతో పాటు, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అంతేగాక గత రెండు నెలల కిందట చిన్న కొడప్‌గల్ వైపు నుండి పిట్లంకు చెందిన జబ్బార్ పిట్లం వైపు మోటార్ సైకిల్‌పై వస్తుండగా గేదే అడ్డురావడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అంతేగాక గత రెండు రోజు కిందట జుక్కల్ మండలం కౌలాస్ గేట్ ప్రాంతంలో బిచ్కుంద మండలం పెద్ద తక్కడ్‌పల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మోటార్ సైకిల్‌పై చేనుకు వెళ్లి తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఇలా రహదారిపై ప్రమాదాలు తరచుగా జరుగుతుండటంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

అడ్డదిడ్డంగా రాకపోకలు.. పలు ప్రాంతాల్లో కంచె తొలగింపు

జాతీయ రహదారిపై ప్రయాణం సాఫీగా సాగేందుకు హైవే భద్రత సిబ్బంది పెట్రోలింగ్ వాహనాలు తిప్పుతుంటారు. అనుకోకుండా ప్రమాదాలు జరిగితే సహాయం చేయడానికి పెట్రోలింగ్ చేసేవారు సహాయపడతారు. అయితే ఈ రహదారిపై వివిధ ప్రాంతాల్లో వాహనదారులు తమ ద్విచక్ర వాహనాలను ఇష్టం వచ్చిన చోటు నుండి హైవే మధ్యలో నుండి తీస్తుండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అంతేగాక ప్రమాదాలు జరగకుండా ఆయా ప్రాంతాల్లో కంచె లేకుండా ఉండటంతో ఆ వైపు నుంచి వచ్చే జంతువులు, పశువులతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో అయితే వివిధ వ్యాపార వర్గాలకు వారు యథేచ్ఛగా కంచె తొలగించి తమ వ్యాపారాలు చేసుకుంటున్నారు. మంగ్లూర్ శివారులో అయితే ఓ హోటల్ వారు కంచెను తొలగించి అక్రమంగా లారీలకు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో లోపలి వైపు నుంచి వచ్చే రహదారి వాహనాలు వచ్చే సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

భద్రత కల్పించాలని వాహనదారుల వేడుకోలు..

జాతీయ రహదారిపై ప్రయాణం సాఫీగా సాగేలా హైవే సిబ్బంది వారు తగిన జాగ్రత్తలు తీసుకుని ప్రయాణానికి ఎటువంటి ఆటంకం కలుగకుండా చర్యలు తీసుకోవాలని, మరిన్ని ప్రమాదాలు జరగకముందే హైవే సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయం గురించి 161 జాతీయ రహదారి సేఫ్టీ ఇంజనీర్ బాల్‌రాజ్‌ను వివరణ కోరగా రహదారిపైకి ఆయా గ్రామాల ప్రజలు తమ పశువులను తీసుకరాకుండ అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రహదారిపైకి పశువులు, జంతువులు రాకుండ సిబ్బంది ఏర్పాటు చేశామని తెలిపారు. అయితే కొంతమంది తమ సిబ్బంది లేని సమయంలో పశువులను మేత కోసం రహదారిపైకి తీసుకవస్తున్నారని, అటువంటి వారికి నోటీసులు ఇచ్చి పోలీసులకు వారిపై ఫిర్యాదు చేస్తామని తెలిపారు. రహదారిని భద్రతగా ఏర్పాటు చేసిన కంచెను కొన్ని ప్రాంతాలలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారని, వాటిని త్వరలో పునరుద్ధరణ చేస్తామని తెలిపారు. అక్రమంగా కంచెను తొలగించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.


కారుకు అడ్డం వెళ్లి చనిపోయిన గేదె (ఫైల్)


కంచె తొలగించి అక్రమంగా లారీలు పార్కింగ్ చేసిన దృశ్యం


పిట్లం శివారులో గేదెలు అడ్డురావడంతో బోల్తాపడిన కారు (ఫైల్)


రహదారి మీదుగా వెళ్తున్న గొర్రెల మంద

జర దేఖో!!


లక్కోర ప్రభుత్వపాఠశాల ప్రహరీ సమీపంలో కంచెలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్


మోతె, వేల్పూర్ రహదారి సమీపంలో..

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

● ఆందోళన చెందుతున్న ప్రజలు

వేల్పూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరి కొట్టొచ్చినట్టు కనబడుతోంది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు, బోర్డుల చుట్టు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఇనుప రక్షణ కంచెను ఏర్పాటు చేయాల్సి ఉన్న ఆవిషయం పట్టించుకోవడం లేదు లక్కోర, ప్రభుత్వ పాఠశాల ప్రహరీని ఆనుకొని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను, అలాగే మోతె, వేల్పూర్ వెళ్లే ప్రధాన రోడ్డు సమీపంలో, పచ్చలనడ్కుడ, వేల్పూర్ గ్రామాల మధ్య ప్రధాన రహదారిని ఆనుకొని ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచెను, బోర్డులు ఏర్పాటు చేయలేదు. అదే విధంగా మండలంలోని వివిధ గ్రామాల్లో కూడా ట్రాన్స్‌ఫార్మర్‌లకు చుట్టు రక్షణ కంచె లేకపోవడం, రోడ్డుకు కొంత ఎత్తులోనే ఉండడం, గద్దె కూడా సక్రమంగా లేక పోవడం ఐడర్ బండరాళ్లు లేదా, సిమెంట్ రింగుల వంటివి పెర్చి ఉండడంతో అవి ఎప్పుడు కులిపోతాయేనని, గ్రామాల్లో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పచ్చలనడ్కుడ, లక్కోర గ్రామ రోడ్లలో ట్రాన్స్‌ఫార్మర్‌లు సమీపంలోనే పాఠశాల ఉండడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు ఈ దారిలోనే వెళ్తాంటారు. మండలంలో ఏ గ్రామానికి వెళ్లినా రక్షణ కంచెలు, బోర్డులు లేనివి దర్శనమిస్తాయి. రోడ్లకు ఆనుకొని ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేయడంతో వాహనాలు తగిలే ప్రమాదం ఉంది. చాలా వరకు ట్రాన్స్‌ఫార్మర్‌లు బోర్డులు లేకపోవడం వల్ల విద్యుత్ వైర్లు, ఫ్యూజ్‌లు బైటే ఉండి ప్రమాదకరంగా మారాయి. తక్కువ ఎత్తులో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌కు అప్పుడప్పుడు జీవలు తగిలి విద్యుత్‌షాక్‌తో మరణించిన సంఘటనలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో రోడ్లను అనుకొని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద వాహనదారులు ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్న వాహనదారులు నేరుగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొనే ప్రమదం ఉందని ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఈ ట్రాన్స్ ఫార్మర్‌లు మరి ప్రమాదకరంగా మారే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఎలాంటి ప్రమాదాలు జరగకముందే విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యం విడనాడి ప్రమాదకర పరిస్థితులు ఉన్న చోట రక్షణ కంచెలు, బోర్డుల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకొని సరిచేయించాలని ప్రజలు కోరుతున్నారు.


పచ్చలనడ్కుడలో పాఠశాల సమీపంలో..


వేల్పూర్, పచ్చలనడ్కుడ మధ్య వాగుబ్రిడ్జి సమీపంలో రోడ్డును ఆనుకొని..


పచ్చలనడ్కుడ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ఆంధ్రజ్యోతి పరిశీలన


భోజనశాలలో పార్కింగ్ చేసిన వాహనాలు

భోజనశాల

అందుబాటులోకి వచ్చేదెన్నడో..?!

● అసంపూర్తిగా నిర్మాణం ● మైదానంలోనే భోజనం చేస్తున్న విద్యార్థులు

సదాశివనగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో నిర్మించిన భోజనశాఖ అసంపూర్తిగా ఉండడంతో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేయడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం నాణ్యమైన విద్య అందించాలని ఆదర్శ పాఠశాలలను ఏర్పాటుచేసినప్పటికీ విశాలమైన స్థలాలు సేకరించి తరగతి గదుల్లో వసతులు ఏర్పాటుచేసినప్పటికీ మధ్యాహ్న భోజన శాలలను ఏర్పాటుచేయకపోవడంతో వర్షాకాలం వర్షం, వేసవి కాలంలో ఎండలో మైదానాలలో కూర్చోని భోజనం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. భోజనం చేసే సమయంలో గాలివచ్చిన దుమ్ము దూళి విద్యార్థుల భోజనాలపై పడి విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు.

దాత సహాయంతో కొంత నిర్మాణం

అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి ఆదర్శ పాఠశాలను సందర్శించిన సమయంలో విద్యార్థులు మధ్యాహ్నభోజనం చేస్తున్న తీరును చూసి రూ.4లక్షలను భోజనశాల నిర్మాణానికి అందించారు. ఆర్థిక సహాయం నిర్మాణంతో చేసిన భోజనశాఖ పూర్తికాకపోవడంతో మరిన్ని నిధులు అందజేస్తే విద్యార్థులకు మరింత మేలు జరగనుంది.

వాహన పార్కింగ్‌కు వినియోగం

దాతల ఆర్థికసహాయంతో నిర్మించిన భోజనశాల అర్ధాంతరంగా మిగిలిపోవడంతో ఉపాధ్యాయులకు వాహన పార్కింగ్ షెడ్డుల మిగిలిపోయిందని ఆదర్శ పాఠశాలకు వచ్చిన వారు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అన్నితెలిసిన ఉపాధ్యాయులే ఇలా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. రోజు షెడ్డును క్లీన్ చేయించి శుభ్రంగా ఉంచితే కనీసం కొంతమంది విద్యార్థులకు అయినా సగం నిర్మించిన షెడ్డు ఉపయోగపడుతుందని పలువురు తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.


ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్నభోజనం అందుకుంటున్న విద్యార్థులు

స్థానిక సంస్థలకు సన్నద్ధం

(ఐదో పేజీ తరువాయి)

స్థానాలలో ప్రాతినిధ్యం ఉండే విధంగా పార్టీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామ, మండల స్థాయిలో దృష్టి పెట్టి ఇప్పటి నుంచే ఎన్నికలకు సన్నద్ధమవుతున్నారు. ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు దినేష్, మల్లికార్జున్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మేడపాటి ప్రకాశ్‌రెడ్డితో పాటు ఇతర నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీతో పాటు కీలకమైన పదవులను దక్కే విధంగా ఇప్పటి నుంచే ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. ఈ దఫా ఎలాగైనా స్థానిక సంస్థల్లో సీటు సాధించే విధంగా ఏర్పాట్లను చేసుకుంటున్నారు. మూడు పార్టీల నేతలు ముందస్తుగానే ఎన్నికలకు సిద్ధమవుతుండటంతో గ్రామాల్లో రాజకీయ సందడి మొదలైంది. పోటా పోటీగా కార్యక్రమాలు మూడు పార్టీల నేతలు నిర్వహిస్తుండటం వల్ల ఇప్పటి నుంచే క్యాడర్ కూడా పనులు మొదలు పెట్టారు. జనవరిలో ఎన్నికలు నిర్వహిస్తే పోటీ కోసం సన్నద్ధమవుతున్నారు. పదేళ్ల తర్వాత వస్తున్న స్థానిక సంస్థల్లో పోటీ కోసం తమ పార్టీ నేతలు సిద్ధమవుతున్నారని కాంగ్రెస్ నేతలు తెలిపారు. ఈ దఫా ఈ ఎన్నికల్లో ఎక్కువ మందే పోటీ పడనున్నట్లు వారు తెలిపారు.

యాసంగి ప్రణాళిక సిద్ధం

(ఐదో పేజీ తరువాయి)

పరిమితం కాగా సరస్వతి కాలువ నిర్మల్ జిల్లా పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. ఈ దఫా శ్రీరాంసాగర్ ప్రాజెక్టుతో పాటు లోయర్ మానేరు డ్యామ్, మిడ్‌మానేరులో పూర్తిస్థాయి నీటిమట్టాలు ఉన్నాయి. ఎస్సారెస్పీలో 80.501 టీఎంసీల నీళ్లు ఉండగా లోయర్ మానేరు డ్యామ్‌లో 24 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. మిడ్‌మానేరులో 28 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. యాసంగి ఆయకట్టుకు ఈ మూడు ప్రాజెక్టుల నీటిని వినియోగించనున్నారు. శ్రీరాంసాగర్ పరిధిలో మొత్తం ఆయకట్టుకు 70 టీఎంసీల వరకు నీళ్లు అవసరం అవుతాయని సాగునీటి శాఖ అధికారులు అంచనా వేశారు. ఎస్సారెస్పీతో పాటు లోయర్ మానేరు డ్యామ్‌లో ఉన్న నీళ్లు ఈ ఆయకట్టుకు సరిపోనున్నాయి. యాసంగి సాగు మొదలు కానుండటంతో అధికారులు ముందస్తుగానే ఆయకట్టు ప్రణాళికను సిద్ధం చేశారు. ఎస్సారెస్పీ పరిధిలో ఉన్న సీఈ ఆదేశాల మేరకు ఎల్ఎండికి ఎగువన ఉన్న మొత్తం ఆయకట్టుకు సాగునీరు అందించే విధంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఎల్ఎండికి దిగువన అక్కడి ప్రాజెక్టు అధికారులు ప్రణాళికను రూపొందించారు. రెండు ప్రాజెక్టుల పరిధిలో గత యాసంగి సాగులాగానే తాగునీటికి కొన్ని నీళ్లు నిలువ ఉంచి మిగతా నీటిని సాగుకు మళ్లించే విధంగా ఈ ప్రణాళికను రూపొందించారు. ఎస్సారెస్పీ పరిధిలో ఈ యాసంగిలో ప్రధాన కాలువలతో పాటు ఎత్తిపోతల పథకాల కింద మొత్తం 12లక్షల ఎకరాల వరకు సాగునీటిని అందించే విధంగా నిర్ణయం తీసుకున్నారు. కాకతీయ కాలువ పరిధిలోని ఎక్కువ సాగు అవుతుండగా గుత్ప, అలిసాగర్ ఎత్తిపోతల పథకాలతో పాటు లక్ష్మి, సరస్వతి కాలువల కింద ఈ సాగునీటిని అందించే విధంగా ఈ ప్రణాళికలో పొందుపర్చారు. మొత్తం యాసంగి సాగు కోసం ఈనెల చివరి వారం నుంచి నీటిని విడుదల చేసి ఏప్రిల్ వరకు కొనసాగించే విధంగా ప్రణాళికలు రూపొందించారు.

వారంలో సాగునీటి శాఖ ఆధ్వర్యంలో సమావేశం

యాసంగి సాగుకు నీటి విడుదలపై ఈ వారంలోను రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరుగనుంది. రాష్ట్రస్థాయి ప్రాజెక్టుల అన్ని ఆయకట్టులపై నిర్ణయం తీసుకోనున్నారు. అదేరోజు ఎస్సారెస్పీ ఆయకట్టును నిర్ధారించడంతో పాటు నీటి విడుదలపై నిర్ణయం తీసుకోనున్నారు. ప్రస్తుతం పంట కోతలు పూర్తవడంతో పాటు నారుమళ్లను సిద్ధం చేస్తున్నందున పూర్తిస్థాయిలో ఈ ప్రణాళికను ఎస్సారెస్పీ అధికారులు రూపొందించారు.

బాలికల కళాశాలను తనిఖీ చేసిన డీఐఈవో

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను సోమవారం డిఐఈవో రవికుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో తరగతి గదులను, పరిసరాలను పరిశీలించారు. కళాశాలలో అధ్యాపకుల బోధన తీరును విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం అధ్యాపకులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి రాబోయే ఇంటర్ ప్రయోగ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయడంతో పాటు వార్షిక పరీక్షలకు మిగిలిన 95 రోజులకు ప్రణాళిక బద్ధంగా బోధన చేయాలని ఆదేశించారు. ప్రయోగ తరగతులు వెంటనే పూర్తి చేయాలని చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులను నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఇంచార్జి ప్రిన్సిపాల్ ఫహీముద్దీన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

గూపన్‌పల్లిలో ఒకరి ఆత్మహత్య

మోపాల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గూపన్‌పల్లి గ్రామానికి చెందిన పైడిపిట్ల గంగాధర్ (32) సోమవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఆరిఫ్ తెలిపారు. గంగాధర్ గత కొంత కాలంగా మద్యానికి బానిస కావడంతో గంగాధర్ తండ్రి మందలించడంతో గంగాధర్ ఇంట్లో ఎవరూలేనిది చూసి తన బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నియామకం

సుభాష్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): టిఎన్‌జివోస్ ఆర్మూర్ యూనిట్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా శశికాంత్‌రెడ్డి, న్యాలకంటి విశాల్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని టిఎన్‌జివోస్ కార్యాలయంలో టిఎన్‌జివోస్ అధ్యక్షుడు నాశెట్టి సుమన్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇటీవల ఆర్మూర్ యూనిట్‌కు సంబంధించిన అధ్యక్ష, కార్యదర్శులు బదిలీపై వెళ్లడంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సుమన్ తెలిపారు. సభ్యులందరూ ఏకవాక్య తీర్మానంతో యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు కార్యవర్గాన్ని కోఆప్షన్ పద్ధతిన ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నికైన నూతన కార్యవర్గం ఉద్యోగుల సమస్యలపై పోరాడి హక్కుల సాధన కోసం పోరాటం చేయాలని అన్నారు. కోశాధికారిగా కస్తూరి శ్రీనివాస్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి నేతికుంట శేఖర్, సహ అధ్యక్షులు చిట్టినారాయణరెడ్డి, కేంద్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, టిఎన్‌జివోస్ ఆర్మూర్ పూర్వ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'కి ప్రాధాన్యం ఇవ్వాలి : కలెక్టర్



కలెక్టరేట్ ఎదుట ఏఐపికెఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్య తను ఇస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరిం చాల ని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్ర మానికి 80 వినతులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, సహాయ కలెక్టర్ సంకేత్‌కుమార్, డీఆర్‌డివో సాయాగౌడ్, ఆర్‌డివో రాజేంద్రకుమార్, ఇంచార్జి డిపివో శ్రీనివాస్, నిజామాబాద్ ఏసిపి రాజావెంకటిరెడ్డిలకు విన్న విస్తూ వినతులు సమర్పించారు. కాగా ఆర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

కలెక్టరేట్ ఎదుట ఏఐపీకేఎంఎస్ ధర్నా..

ప్రభుత్వం నూతన రేషన్ కార్డులు ఇవ్వాలని, ఇండ్లులేని వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.12వేల జీవనభృతి ఇవ్వాలని కోరుతూ అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం, అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్య దర్శులు ప్రభాకర్, రామకృష్ణలు మాట్లాడుతూ రైతాంగాన్ని, వ్యవసాయ కార్మికులను విస్మరిస్తే ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. రైతులకు రైతుభరోసా, బోనస్, వ్యవసాయ కార్మికులకు 12వేల జీవనభృతి అమలు చేయాలన్నారు.

మహిళలు, పిల్లలపై దాడులను అరికట్టాలి..

సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దేశంలో మహిళలు, పిల్లలపై పెరుగుతున్న హింస, సమాజంలో పని ప్రదేశాల్లో మహిళలపై కొనసాగుతున్న వివక్షను ప్రధాన మంత్రి మోదీకి తమ మెమోరాండాన్ని పంపించాలని కోరుతూ సిఐటియు జిల్లాశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ వినతిపత్రం అందజేశారు. దేశంలో పురుషులు, మహిళలతో సహా యావత్ కార్మికవర్గం భయాందోళన చెందుతున్నారని మహిళలపై అన్ని రకాల వివక్ష హింసను అంతం చేయడానికి మహిళలకు భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్, అంగన్‌వాడిల జిల్లా ప్రధాన కార్యదర్శి స్వర్ణ, రేణుక, సుమలత, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు వచ్చిన సోయా రైతులు..

సోయా పంటను కొనుగోలు చేయాలని కోరుతూ హున్సా సహకార సంఘం పరిధిలోని హున్సా, మందర్న, కాజాపూర్ గ్రామాల సోయా రైతులు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. పంట కోత కోసి ఆరబెట్టి సుమారు రెండు నెలలు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం నాఫెడ్ ద్వారా కాని, మార్క్‌ఫెడ్ ద్వారా కాని సొసైటీల ద్వారా ప్రభుత్వ మద్దతు ధర రూ.4892కు కొనుగోలు చేస్తున్న సందర్భంగా తమ ప్రాంతంలో పండిన సోయా కొంత డిస్కలర్ అయ్యిందని దీనివల్ల సారంగపూర్ గోదాం అధికారులు తమ సోయాను రిజెక్ట్ చేశారని కావున తాము తీవ్రంగా నష్టపోతున్నామని అధికారులు స్పందించి తమ సోయాను ప్రభుత్వ మద్దతు ధరతో కొనుగోలు చేయాలని కోరారు. ఎస్‌బిఐ సాలూరా బ్రాంచ్‌లో చెరకు పంటపై ఎకరాన 70 నుంచి 80వేల చొప్పున క్రాప్‌లోన్ తీసుకున్నప్పటికీ మా ప్రాంతంలో చాలా మంది రైతులకు 2లక్షల రుణమాఫీ జరగలేదన్నారు.

కలెక్టరేట్‌కు వచ్చిన వీఆర్‌ఏలు..

జివో నంబర్ 81 ప్రకారం 61 సంవత్సరాలు పైబడిన విఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ విఆర్‌ఏ జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌కు వచ్చి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో 80 రోజుల పాటు దీర్ఘకాలిక సమ్మె పోరాట ఫలితంగా జివో నంబర్ 81, 85 విడుదల చేసి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విఆర్‌ఏలలో డిగ్రీ చదివిన వారికి జూనియర్ అసిస్టెంట్లుగా, ఇంటర్ చదివిన వారికి రికార్డ్ అసిస్టెంట్లుగా, పదవ తరగతి లోపు చదివిన వారికి ఆఫీస్ సబార్డినెంట్‌గా ఉద్యోగాలు ఇచ్చారని వయస్సు పైబడి అనారోగ్యం పాలైన విఆర్‌ఏల స్థానంలో వారి వారసులు కొందరు విధులు నిర్వహిస్తున్నారని కావున వారసత్వ విఆర్‌ఏల సేవలను వినియోగించుకోవాలని కోరారు.



హాస్టల్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

మహాత్మా జ్యోతిబా పూలే హాస్టల్ తనిఖీ

మోపాల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంజర్ గ్రామ శివారులో ఉన్న మహాత్మ జ్యోతిబా పూలే బాలుర వసతి గృహంను సోమవారం రాత్రి అదనపు కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. హాస్టల్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మంచి పౌష్టిక ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. భోజనంలో నాణ్యత లేకుంటే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. హాస్టల్‌లోని రికార్డులను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంపిడివో, ఎంఆర్‌వో, అధికారులు ఉన్నారు.

సీఎం కప్ గేమ్స్‌పై సమీక్ష

ధర్పల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 10, 11, 12 తేదీలలో జరిగే సీఎం కప్ నిర్వహణపై మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడివో బాలకృష్ణ ఎంఈవో, ఎంపివో, అన్ని పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, పీడీ, పీఈటీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడివో మాట్లాడుతూ సీఎం కప్‌లో పాల్గొనే విద్యార్థులు ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఆయా గ్రామాలలో గల కార్యదర్శులు సీఎం కప్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించి పాల్గొనే విధంగా చూడాలని సూచించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ క్రీడలను విజయవంతం చేయాలన్నారు.

రుచికరమైన భోజనాన్ని అందించాలి

సిరికొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించిన మెనూ ప్రకారం పిల్లలకు రుచికరమైన భోజనాన్ని అందించాలని తహసీల్దార్ రవీందర్‌రావు అంగన్‌వాడీ టీచర్లను, ప్రధానోపాధ్యాయులను కోరారు. సోమవారం మండలంలోని నర్సింగ్‌పల్లిలో గల అంగన్‌వాడీ స్కూల్లో పిల్లలకు వడ్డించే భోజనాన్ని, సిరికొండ హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆయన సూచించారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఫారెస్టు అధికారులు

'అటవికి నిప్పు'పై అవగాహన

మోపాల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని సిర్పూర్ గ్రామంలో ముదక్‌పల్లి సెక్షన్ నిజామాబాద్ సౌత్ రేంజ్ ఆధ్వర్యంలో అటవీకి నిప్పు నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫారెస్టు అధికారులు మాట్లాడుతూ అటవికి నిప్పు పెట్టడం వల్ల ఎదురయ్యే ఇబ్బందులు, వాటి నివారణ గురించి గ్రామస్తులకు వివరిం చారు. అటవికి నిప్పు పెట్టడంతో మనం ఎంత నష్టపోతున్నామనేది గ్రామస్తులు అర్థం చేసుకోవాలని కోరారు. పర్యావరణాన్ని కాపాడు కోవాలని సూచించారు. వ్యవసాయ భూములకు నిప్పు పెట్టడంతో ఆ నిప్పు అటవికి అంటుకొని విలువైన కలప దగ్ధంకు గురవుతుందని అన్నారు. ఇకనుండి అటవి ప్రాంతానికి ఎవరు నిప్పు పెట్టవద్దని కోరారు. ఈ ప్రాంతంలో వివిధ రకాల పక్షులు, జీవులు తిరుగు తుంటాయని అన్నారు. సమావేశంలో ఫారెస్టు ఉన్నతాధికారులతో పాటు రేంజ్ అధికారి, సెక్షన్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో విద్యార్థిని ఆత్మహత్య

● రాణాకుర్దు గ్రామంలో విషాదం

మోపాల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోపాల్ గ్రామానికి చెందిన కుచన్‌పల్లి రఘుపతిరెడ్డి కూతురు ప్రజ్ఞారెడ్డి సోమవారం ఆత్మహత్య చేసుకున్న సంఘటన తెలియడంతో వారి బంధువులు, కుటుంబ సభ్యులు తరలివెళ్లారు. ప్రతిజ్ఞ హైదరాబాద్ నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియెట్ రెండవ సంవత్సరం చదువుకుంటుంది. హాస్టల్ ఒత్తిడివల్లనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకుందని వారి బంధువులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రతిజ్ఞ మరణించిన వార్తను అదే కళాశాలలో చదువుకుంటున్న రఘుపతి రెండవ కూతురు తల్లిదండ్రులకు సమాచారాన్ని అందించింది. రఘుపతిరెడ్డికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈ ఇద్దరు కూతుళ్లు కూడా అదే కళాశాలలో చదువుకుంటున్నారు. రఘుపతిరెడ్డి భార్య విజయ ఇద్దరు కలిసి తిరుపతికి వెళ్లారు. ఈ సమాచారం తెలియడంతో వెంటనే అక్కడ ఇనుండి విమానంలో హైదరాబాద్‌కు సోమవారం సాయంత్రం 5గంటలకు చేరుకున్నారు. ప్రతిజ్ఞ బంధువులు పెద్ద సంఖ్యలో హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ప్రతిజ్ఞ మరణించిన వార్త గ్రామంలో తెలియడంతో తీవ్ర విషాదం నెలకొంది.



కేశవరావును కలిసిన ఉపాధ్యాయులు

స్కూల్ అసిస్టెంట్‌లకు నోషనల్ సీనియారిటీ ఇవ్వాలి

● ప్రభుత్వ విద్యాశాఖ సలహాదారు కేశవరావుకు ఉపాధ్యాయుల వినతి

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): 2002లో పదోన్నతి పొందిన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు అక్టోబర్ 16, 2002 నుంచి నోషనల్ సీనియారిటీ ఇవ్వాలని స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ సలహాదారు కేశవరావును కలిసి వినతిపత్రం అందజేశారు. స్కూల్ అసిస్టెంట్లకు తీవ్ర అన్యాయం జరిగిందని దానిపై హైకోర్టు నోషనల్ సీనియారిటీని పునరుద్ధరించాలని తీర్పు చెప్పిందని డిఎస్సీ-2002 స్కూల్ అసిస్టెంట్ల కంటే ముందుగా వీరికి నోషనల్ సీనియారిటీ ఇవ్వాలని కోరారు. ముఖ్యమంత్రి, ప్రభుత్వ కార్యదర్శితో మాట్లాడి తొందరలోనే న్యాయం జరిగేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఆయనను కలిసిన వారిలో టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల సురేష్, భౌతిక శాస్త్రం ఫోరం అధ్యక్షుడు అజయ్‌సింగ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

హామీలను అమలు చేయాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్

ఖిల్లా, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి):ఎన్నికల సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చే యడంలో పూర్తిగా విఫలం చెందుతున్నారని క్రమంగా ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుందని సీపీఎం.రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా పాలన పేరుతో సాధించిన విజయాల పైన విజయోత్సవ సభలను నిర్వహిస్తుందని, కాని నేటికి ఇంకా అనేక సమస్యలు పరిష్కరించలేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అపరిష్కృతంగా ఉండడంతో ప్రజలు తీవ్ర నిరాశకు గురవుతున్నారన్నారు. నిదానంగా రైతు భరోసాను ఇంతవరకు అమలు జరుపకపోవడంతో పాటు, రైతులు పండించిన అన్ని రకాల ఉత్పత్తులకు కాకుండా కేవలం సన్నవరికి మాత్రమే 500ల రూపాయలను బోనస్ ధర ఇవ్వడం మూలంగా ఇతర పంటలు పండించిన రైతులు నష్టపోతున్నారన్నారు. వ్యవసాయ కూలీలకు 2500ల రూపాయలు అమలు పరుపుతామని, వృద్ధులు, వితంతువులకు 4000రూపాయల పించన్ పెంచుతామని, వికలాంగులకు 6000రూపాయలు పెంచన్ చెల్లిస్తామని చెప్పి ఇప్పటికి అమలు చేయడం లేదని ఆరోపించారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయలేదన్నారు. జాబ్‌క్యాలండర్ ప్రకారం ఉద్యోగాల భర్తీ ఇంకా జరుగలేదన్నారు.ఉద్యోగ కార్మికుల వేతనాలు పెంచేందుకు అదే పనిగా పెండింగ్ డీఏలు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే పూర్తి చేయాలని సమస్యలను పరిష్కరించాలని అన్నారు. లేనియెడల పెద్ద ఎత్తున పోరాటాల్లో కి వస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్.రమా, జిల్లా కార్యదర్శి ఏ.రమేష్ బాబు, వెంకట్‌రాములు, నూర్జహాన్, శంకర్‌గౌడ్, వెంకటేశ్, కమిటీ సభ్యులు నన్నేసాబ్, సుజాత, విగ్నేష్ పాల్గొన్నారు.

సంఘీభావ సభను విజయవంతం చేయండి

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్ హిందువుల రక్షణకై ఈనెల 4న హిందు ఐక్యవేదిక ఆధ్వర్యంలో తలపెట్టిన సంఘీబావ సభను విజయవంతం చేయాలని ఐక్యవేదిక బాద్యులు అన్నారు. సోమవారం నగరంలో నిర్వహించిన సమావేశంలో బాద్యులు మాట్లాడుతూ బంగ్లాదేశ్ హిందువులపై దాడులు జరిపిన నేపథ్యంలో వారికి రక్షణ కొరకై ఎన్టీఆర్ చౌరస్తా వద్ద అన్నివర్గాల ప్రజలు, అన్ని హిందు సంస్థల ఆధ్వర్యంలో సంఘీబావ సభను నిర్వహించడం జరుగుతుందని అన్నారు.

'జనాభా ప్రకారం రిజర్వేషన్లు కోరుకున్న వారే నిజమైన అంబేద్కర్ వాదులు'

సుభాష్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీలో అన్ని కులాలకు జనాభా ప్రకారం రిజర్వేషన్లు కోరుకున్న వారు నిజమైన అంబేద్కర్ వాదులని ఎంఆర్‌పిఎస్ నాయకులు నాంపల్లి అన్నారు. జిల్లా కేంద్రంలో ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సామాజిక న్యాయాన్ని కోరుకోలేని వారు అంబేద్కర్ వారసులు ఎలా అవుతారని ప్రశ్నించారు. రాజ్యాంగంలో ఆర్టికల్ 341 ఉపవర్గీకరణ చేయరాదని ఎక్కడ లేదని సుప్రీం కోర్టు స్పష్టంగా చెప్పడం జరిగిందన్నారు. ఎస్సీ జాబితాలో ఉన్నవారిని తొలగించాలన్న కొత్తవారిని చేర్చుకోవాలన్న ఆర్టికల్ 341 ఉపయోగపడుతుందని సుప్రీం కోర్టు తెలిపిందన్నారు. కాని కొంత మంది ఆర్టికల్ 341కు వ్యతిరేకంగా సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని అందరం కలిసి సమన్యాయం కోసం పోరాడుదామని మాట్లాడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, పోశెట్టి, గణేష్, రవి, సాయిలు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు రూపు మాపాలనే పార్టీలకు బుద్ధిచెబుతాం

= ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ గైని గంగారాం

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో రిజర్వేషన్లు రూపుమాపాలనే పార్టీలకు బుద్ధి చెబుతామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ గైనిగంగారాం అన్నారు. సోమవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు సక్కి విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సిద్ధం రాజేందర్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆదివారం సికింద్రాబాద్ జింఖానాగ్రౌండ్‌లో నిర్వహించిన మాల సింహగర్జన విజయవంతమైందని సహకరించి కష్టపడిన మాల సోదరీ సోదరీమణులకు, ప్రతీగ్రామం నుంచి స్వచ్ఛందంగా వాహనాలు, ఆహారం సమకూర్చుకొని వచ్చిన మాల బంధువులకు కృతజ్ఞతలు తెలిపారు. సింహగర్జనలో పాల్గొని మాలల సత్తా చూపించిన కార్మికులకు, ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు. మాల ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, నాగరాజుల దిష్టిబొమ్మలను తగలబెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. భవిష్యత్తులో మాదిగలు చేస్తున్న అసత్య ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నీరడి లక్ష్మణ్, రవి, భీమ్‌రావు గైక్వాడ్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : అమరన్ (12.35, 7.00, 10.30)
: భైరతీ రనాగల్ (4.05)
స్క్రీన్-2 : మోనా-2 (ఇంగ్లీష్ 3డి) (11.00, 1.25, 6.45, 9.10)
: కేశవచంద్ర రమావత్ (3.50)
స్క్రీన్-3 : ఝాన్సీ ఐపిఎస్ (10.05)
: ఫస్ట్ కేస్ ఆఫ్ ఉద్వేగం (1.25)
: ఇష్క్ (4.10)
: లక్కీ భాస్కర్ (7.25)
: జీబ్రా (10.40)
స్క్రీన్-4 : కేశవచంద్ర రమావత్ (10.05)
: రోటీ కపడ రొమాన్స్ (1.00, 7.45)
: ఉక్కు సత్యాగ్రహం (4.15)
: భైరతీ రనాగల్ (10.30)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1: అమరన్ (10.25)
: భైరతీ రనాగల్ (1.30, 7.35)
: రోటీ కపడ రొమాన్స్ (4.30, 10.30)
స్క్రీన్-3 : మోనా-2 (ఇంగ్లీష్ 3డి) (11.00)
: ఇష్క్ (1.30)
: ది సబర్మతి రిపోర్ట్ (హిందీ) (4.30)
: అమరన్ (7.30, 10.30)

దేవి: జీబ్రా (11.15, 6.15)
: మెకానిక్ రాకీ (2.15, 9.15)
నటరాజ్ : అమరన్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్: ఇష్క్ (11.15, 2.15,6.15, 9.15)
లలితామహల్ : భైరతీ రనాగల్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్